నమస్తే తెలంగాణ

నిజామాబాద్

5 | నిజామాబాద్, శనివారం 8 ఫిబ్రవరి 2025 | NIZAMABAD




## ఎండిన పైర్లు.. పొలాల్లో బర్లు

సాగునీరందక వరి పంట ఎండిపోతున్నది. పచ్చని పైరు పశువుల పాలవుతున్నది. ఇందల్వాయి మండలం వెంగల్‌పాడ్‌కు చెందిన రైతు లకావత్ హీరా మూడెకరాల్లో వరి వేశాడు. పైరు ఏపుగా ఎదుగుతున్న తరుణంలో కరెంట్ సరిగా ఉండక పోవడం, సాగునీరందక పోవడంతో ఎకరం పంట ఎండిపోయింది. దీంతో ఆయన దిక్కు తోచని స్థితిలో పడిపోయారు. ఎండుతున్న పొలంలోకి పశువులను వదిలారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని హీరా కోరారు.

– ఇందల్వాయి, ఫిబ్రవరి 7

# బీసీలకు రిక్త 'హస్తం'




బడుగులను మోసగించిన కాంగ్రెస్

- కుల గణన లెక్కలపై అనేక అనుమానాలు
- బీసీ జనాభా తగ్గినట్లు చూపడంపై ఆగ్రహం
- సీట్లు ఇవ్వకుండా మోసగించేందుకేనని సందేహాలు
- హామీల అమలు ఏమైందని ప్రశ్నిస్తున్న బీసీ సంఘాలు
- కామారెడ్డి డిక్లరేషన్ ఎటు పోయిందని మండిపాటు
- కాంగ్రెస్‌పై రగిలిపోతున్న వెనుకబడిన వర్గాలు
- 'స్థానిక' ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధమైన బడుగులు

బాన్సువాడ/నస్రుల్లాబాద్/బిచ్కుంద, ఫిబ్రవరి 7: వెనుకబడిన వర్గాలకు అండగా ఉండాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మరింత వెనక్కు నెట్టేలా కుట్రలకు తెర లేపిందని బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. తాజాగా ప్రకటించిన కుల గణనలో బడుగుల జనాభా తగ్గినట్లు చూపడం వెనుక అనేక కుతంత్రాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అసమగ్రంగా కుల గణన సర్వే నిర్వహించిన రేవంత్ సర్కారు.. ఇటీవల అసెంబ్లీలో ఆ నివేదికను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీల జనాభా పదేండ్లలో తగ్గిందని, అదే అగ్రవర్ణాల సంఖ్య మాత్రం పెరిగిందని ప్రకటించడంపై బీసీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వెనుకబడిన వర్గాల భవిష్యత్తును నిర్దేశించిన కీలకమైన కోటాను తప్పుల తడకగా రూపొందించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కారు.. దాన్ని కేంద్రం మీదకు నెట్టేయడంపైనా మండిపడుతున్నారు. ఇదీ కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమకు నిలువెత్తు నిదర్శనమని చెబుతున్నారు.

### బీసీలకు తీవ్ర అన్యాయం

వాస్తవానికి కుల గణన సర్వే సంపూర్ణంగా, పారదర్శకంగా జరుగలేదన్నది సుస్పష్టం. గ్రామాల్లో, పట్టణాల్లో చాలా ఇండ్ల వివరాలను సేకరించలేదు. ఎన్యుమరేటర్లు తమ ఇంటికి రాలేదని వేలాది మంది చెబుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కుల గణన సర్వే పేరుతో కుట్రలు జరుగుతున్నాయని అప్పట్లోనే అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆయా సందేహాలను బలపరుస్తూ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన కుల గణన నివేదిక ఉండడంపై బీసీలు భగ్గుమంటున్నారు. కావాలనే బీసీ జనాభా తగ్గించి చూపుతున్నారని మండిపడుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉండే బీసీల జనాభా పదేండ్లలో పెరగాల్సి ఉండగా తగ్గిందని చెబుతుండడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బీసీల సీట్ల సంఖ్య తగ్గింపు కోసమే జనాభా తగ్గిందని చూపడం వెనుక ఉన్న అసలు కుట్ర అని చెబుతున్నారు. కాంగ్రెస్ వైఖరితో తమకు న్యాయం జరగదని, తీవ్రంగా నష్టపోతామని బీసీలు ఆందోళన చెందుతున్నారు.

### వక్రబుద్ధి చాటుకున్న కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ బీసీలపై అనేక వరాలు కురిపించి మురిపించింది. అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపి తన వక్రబుద్ధిని మరోసారి చాటుకున్నదని బీసీ వర్గాలు నిప్పులు చెరుగుతున్నాయి. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటు పడతామని కామారెడ్డి వేదికగా 2023 నవంబర్ 10వ తేదీన నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ ప్రకటించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య సాక్షిగా బీసీలను అభివృద్ధి పథంలోకి తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ ముఖ్యులు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయడంతో పాటు బీసీల సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. ప్రత్యేక ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, చేతివృత్తులకు ఆర్థిక సాయం, మండలానికో బీసీ గురుకులం, జిల్లాకో బీసీ భవన్ నిర్మాణం వంటివెన్నో డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ ఏ ఒక్కటీ అమలు చేయకుండా తన నైజాన్ని చాటుకున్నది. ఈ నేపథ్యంలోనే రేవంత్ సర్కారుపై బీసీ వర్గాలు ఐక్య పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. కుల గణన, రిజర్వేషన్లు, నిధుల విషయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ఉద్యమించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

### అన్నీ దొంగ లెక్కలే..



కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన పూర్తిగా తప్పుల తడకగా ఉన్నది. గత పదేండ్లతో పోల్చితే రాష్ట్రంలో బీసీల సంఖ్య పెరగాలి. కానీ తగ్గించి చూపడాన్ని బట్టి రేవంత్ సర్కారు కపట ప్రేమ అర్థమవుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు తగ్గించేందుకు పన్నిన కుట్ర ఇది. గతంలో కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కుల గణన వివరాలు దొంగ లెక్కలేనని తేటతెల్లమవుతున్నది. ఎన్నికల ముందర కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అని చెప్పి బీసీల ఓట్లు దండుకున్నది. కానీ గద్దెనెక్కిన తర్వాత హామీలు అమలు చేయకుండా మొండిచేయి చూపింది. ఏ ఎన్నికలు వచ్చినా బీసీలు బుద్ధి చెప్పేందుకు రెడీగా ఉన్నారు.

-రమేశ్ యాదవ్, బాన్సువాడ

### బీసీలకు మొండిచేయి చూపింద్రు..



అసెంబ్లీ ఎన్నికల ముందర కామారెడ్డి వేదికగా కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. 15 నెలలల్ల అన్ని హామీలు నెరవేర్చుతామని రేవంత్‌రెడ్డి సహా అందరూ చెప్పింద్రు. వాళ్లు చెప్పిన టైం అయిపాయే. డిక్లరేషన్ల చెప్పిన ఒక్క హామీ కూడా నెరవేర్చలే. బీసీల అభ్యున్నతికి విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశం కల్పిస్తామని చెప్పిరి. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటే బీసీలంతా ఆశపడ్డరు. కానీ కాంగ్రెస్ మళ్లా ధోకా చేసింది. కేంద్రం ఒప్పుకుంటేనే రిజర్వేషన్ల అమలు అని మొండిచేయి చూపింది. చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తే ఎక్కువ సీట్లు ఇవ్వాల్సి వస్తుందనే కొత్త నాటకానికి తెర లేపింద్రు. బడుగుల జనాభా తక్కువ జేసి చూపింది కూడా అందుకే. కాంగ్రెస్ పార్టీకి బీసీల ఉసురు తగులుతుంది. రేవంత్ సర్కారును గద్దె దించేదాకా బీసీ సంఘాలు వదలవు.

- చాకలి మహేశ్, బాన్సువాడ

### కుట్ర ప్రకారమే బీసీల సంఖ్య తగ్గించింద్రు..



కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే బీసీలను మోసం చేసేలా ఉన్నది. కేసీఆర్ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో అన్ని వర్గాల జనాభా వంద శాతం కరెక్టుగా వచ్చింది. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 1.85 కోట్లు ఉన్నట్లు తేలింది. అదే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో 1.64 కోట్లుగా బీసీల జనాభాను చూపించారు. 2014నుంచి 2025 వరకు బీసీల సంఖ్య పెరగాల్సింది పోయి 21 లక్షల మేర తగ్గినట్లు చూపించడం ఎంతవరకు సమంజసం. ఎస్సీ జనాభా లెక్కలు కూడా తారుమారుగా చూపించారు. అదే అగ్రవర్ణాల సంఖ్య మాత్రం 16 లక్షలు పెరిగినట్లు చెప్పారు. లెక్కలు తక్కువ చూసి చూపించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నది.

- గొడుబర్ల రాజు, జాతీయ బీసీ సంఘం కామారెడ్డి జిల్లా కార్యదర్శి

### అసంపూర్తిగా సర్వే



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీ గణన వివరాలు సరిగా లేవు. వంద శాతం సర్వే చేసి వివరాలు వెల్లడించాలి. కానీ 96 శాతం సర్వే చేశామని ప్రభుత్వమే చెబుతుంటే, ఆ నివేదికకు విశ్వసనీయత, పారదర్శకత ఎక్కడ ఉంటది. మిగతా నాలుగు శాతం కుటుంబాల సర్వే చేయకుండా బీసీల జనాభా ఇంతే అని చెప్పడమేంది? తప్పుల తడకగా రూపొందించిన కుల గణనను ఆమోదిస్తే బీసీలు చాలా నష్టపోతారు. ఇప్పటికే ఎంతో వెనుకబడిన బడుగులకు న్యాయం జరగాలంటే వెంటనే చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. స్థానిక సంస్థల ఎన్నికల ముందర మరోమారు మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నది తప్పితే బీసీలపై చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదు. రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం చేతిలో పెట్టడం వెనుక కుట్ర ఉన్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. పూర్తి పారదర్శకంగా మళ్లీ సర్వే నిర్వహించి, కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు బీసీలకు న్యాయం చేయాలి.

- కూరెల్లి అశోక్‌గౌడ్, నస్రుల్లాబాద్

### మనోభావాలు దెబ్బ తీస్తున్నారు..



రాష్ట్రంలో అధికంగా ఉన్న బీసీలను రాష్ట్ర ప్రభుత్వం కుల గణనలో తక్కువ చేసి చూపించడం సరికాదు. బీసీల శాతం తక్కువ ఉందని చెప్పడం ద్వారా మా మనోభావాలు దెబ్బ తీస్తున్నారు. చట్టబద్ధంగా మాకు రావాల్సిన అవకాశాలను రాకుండా ఇలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆరు శాతం ఉన్న ఓసీలు 15 శాతానికి పెరిగినప్పుడు, అప్పట్లో 50 శాతానికి పైగా ఉన్న బీసీల జనాభా ఇప్పుడు 46.25 శాతానికి ఎలా తగ్గిపోతుందన్నది ఎవరికీ అంతు చిక్కడం లేదు. కాంగ్రెస్ చేపట్టిన ఈ కుల గణనతో బీసీలకు తీరని నష్టం కలుగుతుంది. ప్రభుత్వం దీనిని వెనక్కి తీసుకుని మళ్లీ పారదర్శకంగా సర్వే నిర్వహించాలి.

- నూకల రాజు, జుక్కల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు

## క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

జిల్లా జడ్జి సునీతా కుంచాల



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీతా కుంచాల

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 7: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తిస్తే నియంత్రించేందుకు వీలుంటుందని జిల్లా జడ్జి సునీతా కుంచాల అన్నారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, బ్రిడ్జి గ్యాప్ హాస్పిటల్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందూరు క్యాన్సర్ దవాఖానలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. బాలసదన్ లోని పిల్లలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి సునీతా కుంచాల మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమని తెలిపారు. మనోధైర్యం ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చని, ఎంతో మంది తమ మనోధైర్యంతో క్యాన్సర్ నుంచి బయటపడ్డారని ప్రముఖ వైద్యులు రమాదేవి, కవితారెడ్డి అన్నారు. డాక్టర్ జీవన్‌రావు, ప్రద్యుమ్నరెడ్డి, కార్తిక్, రోహిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- మోసం చేయడమే కాంగ్రెస్ నైజం
- ఓట్ల కోసం వచ్చే వారిని తరిమికొట్టాలి
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పిలుపు
- కాంగ్రెస్, బీజేపీలది అవినీతి బంధం
- మంత్రి పదవి రాక సుదర్శన్‌రెడ్డికి మతి భ్రమించింది
- హామీలు అమలైనట్లు చూపితే రాజకీయ సన్యాసానికి సిద్ధం
- కాలేదని తేలితే ముక్కు నేలకు రాస్తారా?
- కాంగ్రెస్ నేతలకు జీవన్‌రెడ్డి సవాల్

# బీసీలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 7:కుల గణన పేరిట సీఎం రేవంత్‌రెడ్డి బీసీల గొంతు కోశాడని బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మండిపడ్డారు. మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం కాంగ్రెస్ నైజమని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేని మోసగాళ్లు స్థానిక సంస్థల్లో ఓట్ల కోసం మళ్లీ గ్రామాల్లోకి వస్తున్నారన్నారు. రైతుబంధు, తులం బంగారం, పింఛన్ల పెంపు వాటి హామీలు ఎగ్గొట్టిన కాంగ్రెసోళ్లను గ్రామ పొలిమేరల వరకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి నిజామాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

### పల్లెల్లో ఎమర్జెన్సీ ఛాయలు



పోలీసు కబంధ హస్తాల్లో పల్లెలు నలిగి పోతున్నాయని జీవన్‌రెడ్డి అన్నారు. గ్రామాలను అప్రకటిత ఎమర్జెన్సీ చీకట్లు ఆవరిస్తున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ పాట్లు పడుతున్నదని, మరోమారు ప్రజలను ఏమార్చటానికి పగటి వేషాలు వేస్తున్నదని ధ్వజమెత్తారు. బలవంతపు ఏకగ్రీవాలకు రేవంత్‌రెడ్డి స్కెచ్ వేశారన్నారు. పోలీసు శాఖ కాంగ్రెస్ పార్టీ అనుబంధ శాఖగా మారిందని మండిపడ్డారు. అందరి జాతకాలు పింక్ బుక్‌లో ఎక్కిస్తున్నామని, వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కాంగ్రెస్‌కు లేదని, అయినా గుంటనక్క రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ఆటలు సాగవన్నారు.

### పెద్దాయనకు మతి చలించింది..

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి అల్టీమర్ జబ్బు వచ్చింది. మంత్రి పదవి రాలేదని ఆయనకు మతి చలించిందని జీవన్‌రెడ్డి అన్నారు. బోధన్‌లో ప్రజలు ఛీకొడుతున్నా ఆర్మూర్‌లో ఫోజులు కొడుతుండన్నారు. గెలిపించిన ప్రజలకు ముందు మంచి చేయండని సలహా ఇచ్చారు. నవీపేట్ మండలం చీరాన్‌పల్లికే పోదాం, కాంగ్రెస్ హామీలు అమలు జరిగాయని ఏ ఒక్కరూ చెప్పినా రాజకీయ సన్యాసం తీసుకుంటా. లేకుంటే కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాస్తారా? అని జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. జిల్లాలో కాంగ్రెస్, బీజేపీది అవినీతి బంధమన్న ఆయన.. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కుమ్మక్కై దోచుకుతింటున్నారని మండిపడ్డారు.

### మోసం కాంగ్రెస్ నైజం

ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజమని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. గద్దెనెక్కగానే మాట మార్చి ప్రజలను మోసం చేసిందన్నారు. 2023 డిసెంబర్ 9వ తేదీన రుణమాఫీ చేస్తామన్నరు. పంద్రాగస్టు అన్నారు. దసరా అన్నారు. అయినా ఇప్పటికీ 20 లక్షల పైచిలుకు రైతులకు రుణమాఫీ కాలేదని వివరించారు. రైతు భరోసా ఇవ్వకుండా ఎగ్గొట్టారు. యాసంగి భరోసా సంక్రాంతికి ఇస్తమన్నరు. మాట మార్చి 26 జనవరికి అన్నరు. ఇప్పుడు మార్చి 31 అంటున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చి రైతన్నకు దన్నుగా నిలిస్తే, దాన్ని ఎగ్గొట్టిన రేవంత్‌రెడ్డి రైతులకు భరోసా లేకుండా చేసిండని, దీనిపై రైతులంతా ఏకమై ఊళ్లకొచ్చే కాంగ్రెస్ నాయకుల గల్లా పట్టుకుని నిలదీయాలని పిలుపునిచ్చారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వని, పింఛన్ పెంచని, ఉద్యోగాలు భర్తీ చేయని, నిరుద్యోగ భృతి ఇవ్వని కాంగ్రెసోళ్లను ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు.

### కామారెడ్డి డిక్లరేషన్ తుంగలోకి..

కుల గణన పేరిట రేవంత్‌రెడ్డి బీసీల గొంతు కోశారని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జీవన్‌రెడ్డి కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కామాను చెరిపేసి ఫుల్‌స్టాప్ ఎందుకు పెట్టారని బీసీలు తిరగబడాలన్నారు. చేయాల్సింది రాజ్యాంగ సవరణ కాదు. కావాల్సింది రాహుల్‌గాంధీ వివరణ అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన 420 రోజుల్లో 100 మందికి పైగా ఆటోడ్రైవర్లు, 500 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. గురుకులాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో కల్తీ ఆహారం తిని 55 మందికి పైగా విద్యార్థులు దుర్మరణం పాలయ్యారన్నారు.




నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి,పక్కన విఠల్‌రావు, నీతూకిరణ్, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

## అర్వింద్ అనుచరుల ట్విట్టర్ ఖాతా మూత

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఫలితం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 7: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై 'ఎక్స్'(ట్విట్టర్)లో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అనుచరుల ఖాతాలను సదరు సోషల్ మీడియా సంస్థ రద్దు చేసింది. నియమ నిబంధనలు పాటించక పోవడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఇలాంటి వాటిని సహించబోమని స్పష్టం చేసింది. కవితను రాజకీయంగా ఎదుర్కోలేని అర్వింద్ తన అనుచరులతో సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ఆయా ఖాతాలను 'ఎక్స్'(ట్విట్టర్) నిలిపివేయడంపై బీఆర్‌ఎస్ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ చర్య ఎంపీ అర్వింద్‌కు చెంపపెట్టు అని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

## ఖైదీలకు హక్కులపై అవగాహన

కామారెడ్డి, ఫిబ్రవరి 7: ఖైదీలకు ఉండే హక్కులపై కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి అవగాహన కల్పించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమె శుక్రవారం కామారెడ్డి ఉపకారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖైదీలకు ఉండే హక్కులు, చట్టాల గురించి వారికి వివరించారు. కంప్లైంట్ బాక్స్, వంట గది, జైలు పరిసరాలను పరిశీలించారు. అనంతరం హరిజనవాడలోని బాలసదన్, చిల్డ్రన్స్ హోంకు వెళ్లారు. భవానీపేట్‌లో న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ మోహన్‌రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్‌రావు, సబ్ జైలు సూపరిటెండెంట్ సంజీవరెడ్డి, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది శ్రావణ్, సాయిప్రణీత్, సాయికృష్ణ పాల్గొన్నారు.